## ఆంధ్ర ప్రదేశ్‌లో 'అక్షరం' ఉద్యమానికి చిరుకానుక!




# అమ్మా! నే చదువుకుంటా?

— ప్రియదర్శిని

"అమ్మా!"

కట్టెలని పొయ్యి లోపలికి తోస్తూ ఊదే గొట్టంతో ఊదుతున్న రాజవ్వ గిర్రున వెనక్కి తిరిగి చూసింది. తను చెప్పింది తల్లి సరిగ్గా వినలేదేమోనని తిరిగి ఆమె మాటల్ని వల్లించింది లచ్చిమి అని పిలువ బడే లక్ష్మి.

రాజవ్వ కళ్ళలో కోపం చరచరా వచ్చి నిల్చింది.

"ఎందుకు పోవే?" అని గద్దించింది. లక్ష్మి సమాధానం ఇచ్చే లోపునే "ఏం? ఆ పోకిరిదాన్తో కూకుని ముచ్చట్లాడుకుందామనా! గట్ల కూసుంటే నోట్లోకి కూడొస్తాదా కుమ్ము వస్తదా? అదంటే పోకులాడి. మాటలు నేర్చిన దాన్తోని నువ్వు కూడా కూకుని... "మరింత కోపంగా బెదిరిస్తున్నట్లుగా అంది రాజవ్వ "సకరాలు సెయ్యకుండ సక్కగా పనికి పో లేకుంటే..." పొయ్యికేసి తిరిగి "పనికి పోదంట పనికి" అంది స్వగతంగా పైకి.

దుఃఖం ముంచుకు వచ్చింది లక్ష్మికి. తల్లితో చెప్పినా లాభం లేదు అనుకుంటూ ఒక్క అంగలో గుడిసె బయటికొచ్చింది. ఊసురుమంటున్న మనసుతో నాలుగైదు అడుగులు వేసిందో లేదో "లచ్చిమి" అన్న పిలుపుకి వెనుతిరిగి చూసింది. తొక్కుడు బిళ్ళ ఆడుకొంటున్నది యాది. లక్ష్మి చూడ గానే "ఇటు రా" అన్నట్లు సైగ చేసింది. లక్ష్మి ప్రాణం మరింత ఉసూరుమంది. "దీనికేం సక్కగా ఆడుకొంటది" ఉక్రోషంగా అనుకొంది లక్ష్మి.

"లచ్చిమి!" మళ్ళీ పిలుపు.

అడుగులు అటుకేసి వేయలేదు లక్ష్మి "నేనిప్పుడు రాను పనికి పోతున్నా" అంది బిగ్గరగా.

"వాన పడేటట్టుంది. ఏం బోతవు గానీ ఇక్కడకి రావే" చప్పున తలపైకెత్తి చూసింది లక్ష్మి "మేం సిద్ధం" అన్నట్టున్న మేఘాలు.

"ఇంటికెళ్ళిపోతే" ఒక్కక్షణం ఆశపడింది లక్ష్మి మనసు. ఆ వెనువెంటవే "అమ్మో! ఇంకేమైనా ఉందా? అమ్మకాళ్ళు విరిచి పొయ్యిలో పెడుతుంది. అనుకొంది. అట్లాగని దీన్తో కూకుంటే-? ఇంతకు ముందు ఉత్తిత్తిగ తిట్టింది గానీ ఇప్పుడిక... అడు గుల వేగాన్ని పెంచింది లక్ష్మి. వెనక నుండి యాది 'లచ్చిమ్మి' అని పిలుస్తున్నా వినిపించుకోకుండా; కాని, మనసు మాత్రం మూలుగుతూ నిన్నటి సంభా షణని జ్ఞప్తికి తెచ్చింది.

నిన్న - తను తమ్ముణ్ణి చంకనేసుకొని గుడిసె ముందు నిలబడ్డది "తొక్కుడు బిళ్ళాడుకుందాం వస్తావా లచ్చిమి" అంటూ వచ్చింది యాది. ఆడాలని మనసు కొట్టుకుంటున్నా "మా తమ్ముడేడుస్తాడు వద్దే!" అంది.

"నువ్వెప్పుడింతే" అంటూ ఈసడించింది యాది. "ఈణ్ణే కూకుని కబుర్లాడుకుందాం! దా!" అంది. అలా మాటాడుతూ మాటాడుతూన్న తను పనిచేస్తున్న అమ్మగారు మంచిదా కాదా అని అడిగింది. తను పని చేస్తున్న ఇంటోళ్ళు సానా మంచోళ్ళట సినిమాల గురించి సిత్రంగ మాటాడతారట. నవ్విపిస్తరట. సిన్మాకని డబ్బులిస్తారట. ఆళ్ళు పిల్లల బట్టలిస్త రంట తొడుక్కుంటందుకు. ఇంకా దీని పేరు మోటుగా ఉందని "సునీత" అని పిలుస్తరంట. మురిపెంగ సెప్పుకొంది యాది. ఇయ్యన్నీ నీకు లేవు కదూ అన్నట్లుగా మాట్లాడింది. తన మనసు ఏడ్చింది నిజమేగానీ, ఇది ఎప్పుడంటే అప్పుడే డుమ్మలు కొడుతూనే ఉంటది కదా. అయినా వాళ్లూరుకుంటారా? దొరబిడ్డా? తిట్టినా దులుపుకొంటది గాని' అనుకొని సంతోషపడింది లక్ష్మి. "అయినా ఆ యమ్మగారు మాత్రం ఎంత మంచిది" లక్ష్మి కళ్ళ ముందు తన యజమానురాలి రూపం కదలాడింది. ఆ వెను వెంటనే లక్ష్మి పెదాల మీద సన్నటి నవ్వు ప్రాకింది. 'ఎంత సక్కదనంగ ఉంటదో! తన తోటి ఎంత మంచిగ మాటాడుతదో ఆ మాటలు గట్లను ఇనా లనిపిస్తయి. కానీ పాపం! ఎందుకో ఒక్కర్తె ఉంటుంది" లక్ష్మి ఆలోచనల్ని త్రుంచుతూ టప్ మంటూ ఓ నీటి చుక్కపడింది. తల పైకెత్తి చూసింది లక్ష్మి. టప్! టప్ మంటూపడసాగేయి వాన చినుకులు. ఎడం చేత్తో లంగాని పైకెత్తి పట్టుకుంటూ 'లగెత్తాలి' అనుకుంది. లక్ష్మి అడుగులు వేగాన్ని పుంజుకుంది. రాల్తున్న వర్షపు చినుకుల్లో తడుస్తూ పరుగెత్త సాగింది లక్ష్మి

* * *

తలుపు తట్టిన శబ్దం కావడంతో కదలకుండానే దృష్టి మరల్చి చూసిందీ నీలిమ. అప్పటి దాకా కిటికీలో నుండి వర్షానికి తడుస్తూ తళ తళ లాడు తున్న ఆకుల్తో సంతోషాన్ని వ్యక్తీకరిస్తున్న మొక్కలని చూడ్డంలో ఆనందాన్ని అనుభవిస్తున్న మనసు అక్కడి నుండి కదలవద్దంది. అయినా వర్షంలో తడుస్తూ ఎవరొస్తారిప్పుడు? ఒహో! మళ్ళీ తలుపు చప్పుడు. తన అంచనా తప్పకపోతే - తలుపు రెక్కనొకదాన్ని తెరచి తలని బయటికి పెట్టి చూస్తే లక్ష్మి! వంగి లంగా చివర్ల నుండి నీళ్ళని పిండేవేస్తోంది. వర్షంలో తడవడం వల్ల జుట్టు పాయలు పాయలుగా చీలింది. వాటి చివర్ల నుండి బొట్లు బొట్లుగా రాలుతున్న నీళ్ళు! ఇంత వర్షంలో తడుస్తూ రాకపోతే తగ్గాక రావొచ్చు కదా! అని అంది లక్ష్మితో. "మా అమ్మ పొమ్మన్నదమ్మా" టక్కున జవాబిచ్చి నాలుక్కరుచు కొంది లక్ష్మి. నేను వస్తుంటే తోవలో వాన మొద లయ్యింది అని చెప్పాల్సింది అనుకొంటూ. ఆశ్చ ర్యంతో నీలిమ చూసిన చూపు తన గుండెలోతుల్ని స్మరిస్తున్నట్టు అనిపించింది లక్ష్మికి. ఆ చూపుకో, లేక వర్షంలో తడవడం వల్లనో వణుకు వచ్చినట్లు

యింది లక్ష్మికి. దాన్ని కప్పి పుచ్చుకుంటో అంది "ఆంట్లెయ్యిండమ్మా" గుమ్మానికి అడ్డు తొలగింది నీలిమ. లక్ష్మి లోపల అడుగేయగానే సింకులోని అంట్లని చూపించి మంచం మీద ఉన్న ఇలస్ట్రేటడ్ వీక్లీ అందుకొంది. మనసు కథలో లీనం కాలేదు. దృష్టి లక్ష్మి మీద పడింది చిన్నపిల్ల! ఎంత వయసని? అక్షరాలు దిద్దాల్సిన చేతుల్తో అంట్లు తోముతోంది. ఇహ లక్ష్మి జీవితం అంతా ఇలాగేనా! అనలిప్పుడు ఆ అమ్మాయిలో ఆ వయసు పిల్లల కుండాల్సిన చిలిపి తనం గానీ చలాకీతనం గానీ ఉండవు. అమాయకత వయసుకి మించిన గాంభీర్యం ఉంటాయి. ఎగుర్తూ గెంతుతూ అల్లరి చేయాలని పించదా ఈ అమ్మాయికి అన్పిస్తుంది. ఈ గాంభీర్యం వెనక తన పొట్టకి సరిపడా తానే సంపాదించుకోవాలి అన్న దైన్యం లేదు కదా? ఏమో...? కానీ అందరూ ఇంతేనా! ఇలా ఇళ్ళల్లో పాచిపని చేసుకోవాల్సిందేనా! చదువు సంధ్యలు ఏమీ అక్కరలేదా వీళ్ళకి? చదువు అవసరం అని తెలిదా తెలిసినా నిర్లక్ష్యం చేస్తున్నారా? దీని కంతటికి కారణం పరిస్థితుల ప్రాబల్యమేనా లేక వీరి దృక్పధమూ అనేనా?... ఆలోచన్లని ప్రక్కకి నెట్టి, నెమ్మదిగా పిలిచింది నీలిమ "లక్ష్మీ!"

అంట్లు తోమడంలో మునిగిపోయిన లక్ష్మి తలెత్తి చూడకుండానే" వూఁ" అంది.

"నువ్వెందుకు చదువుకోకూడదు లక్ష్మీ?"

"..."

"మాటాడవేం?"

"ఎట్ల కుదర్తది అమ్మ ప్రొద్దుగాల. సాయంకాలం మీ దగ్గరికి రావాల పగటి పూట ఇంటికాడ ఉండి మా తమ్ముణ్ణెత్తుకోవాల. ఎట్ల కుదర్తది"

"కరెక్టె లక్ష్మీ నువ్వు చెప్పింది నేనూ కాదనను. కాని నీకు చదువుకోవాలి. అన్పించదా?..." లక్ష్మి నుండి బదులు రాకపోవడంతో తిరిగి అంది నీలిమ. "సువ్వన్నట్టు స్కూలు కెళ్ళడం నీకు కష్టమే. నేను చదువు చెబుతాను ఇంటి దగ్గర. చదువుకొంటావా?

మాటాడలేదు లక్ష్మి. మరింత శ్రద్ధగా అంట్లు తోముతున్నట్లు అన్పించింది నీలిమకి. ఆలోచిస్తూందా లేక బాధ పడుతోందా!

"నాకు ఫీజు ఇవ్వాలన్న భయమా లక్ష్మీ!" నవ్వింది నీలిమ. "పని త్వరగా ముగించుకొని ఓ అరగంట చదువు కొంటే చాలు. నిన్నేమీ అడగను. సరేనా?"

లక్ష్మి మౌనం నీలిమని తట్టింది. వెంటనే విషయాన్ని మారుస్తూ "ఔను గానీ లక్ష్మీ మరి నెల నెలా నేనిచ్చే జీతం ఏం చేస్తున్నావు?

"మాయమ్మ కిస్తనమ్మా" తనకేసి తిరిగి టక్కున సమాధానం చెబుతున్న లక్ష్మిని ఆశ్చర్యంగా చూసింది నీలిమ. లక్ష్మి కళ్ళలో ఓ రకమైన మెరుపుతో పాటు ఇంకా ఏదో చెప్పాలన్న ఉత్సాహమూ ఉంది.

"మీ అమ్మ ఏం చేస్తుంది లక్ష్మీ!"

"మరేమో..." ఆగి నీలిమ వంక చూసింది లక్ష్మి. "మా యమ్మ కొచ్చె పైసలన్నీ కూడేసి నాకు మంచి బట్టలు కొనిస్తనన్నదమ్మ. మూడు నెలలు కాగానే కొంటానన్నది. ఇది మూడో నెలే కదమ్మా' గబగబ చెబుతున్న లక్ష్మి కళ్ల ముందు క్రొత్త బట్టలు తిరుగుతూ ఉండి ఉంటాయి.

ఆప్యాయంగా పరిశీలనగా చూసింది నీలిమ. లక్ష్మి కళ్ళలో ఆనందంతో కూడిన మెరుపు ఉంది.కానీ శరీరం మాత్రం వణుకుతోంది. బహుశా వర్షంలో తడవడం వల్ల కాబోలు.

"చలేస్తోందా లక్ష్మీ"

లక్ష్మి ముఖం ఉదాసీనంగా మారింది. తలూపింది. ఇందాక క్రొత్తబట్టల గురించిన ఆలోచనతో మిలమిల లాడిన కళ్ళలో ఇప్పుడు నీరసం ఉంది. తనకీ అవకాశాలు కలిస్తే చాలా ఎత్తుకు ఎదగ గలుగుతుందని చెబితే ఎలా ఉంటుంది? ఆ భావం వారిద్దరి మధ్య సాన్నిహిత్యం కారణంగా కల్గిన ప్రేమాభిమానాల వల్ల కావొచ్చు. లేక ఆమెలోని మానవత్వానికి అది ప్రతీక కావొచ్చు. ఆమెలోని రకరకాల భావాలకి, ఉద్విగ్నతని ఆమె పెదాలు ఉచ్చరించలేదు గాని ఆప్యాయంగా లక్ష్మి భుజం మీద పడింది ఆమె చేయి. మరుక్షణం లాగేసుకొంటూ "లక్ష్మి, నీకు జ్వరం కూడా ఉంది కదు?" అని అడిగింది. తలొంచుకొని నిల్చున్న లక్ష్మిని చూస్తే ఆమెలోని కోపం మరింత హెచ్చి

"మాయమ్మ పొమ్మన్నదమ్మా"

నివ్వెర పోయింది నీలిమ. నీకు జ్వరంగా ఉందని మీ అమ్మతో చెప్పావా అని అడగాలనుకొని మానేసింది. నిజానికి తిట్టాల్సింది ఎవర్నో ఆమెకి భోధపడలేదు. గబగబ స్టౌ వెలిగించి టీకి నీళ్ళు పడేస్తూ అంది "సరే గానీ నా పాత చీర ఇస్తాను. ఆ బట్టలు విప్పి దాన్ని చుట్టుకో. తరువాత మాత్ర వేసుకొందువు గాని"

లక్ష్మి హృదయం ఆర్ద్రమయ్యింది. యాది గనక ఎదురుగా ఉంటే - "మా అమ్మగారి మంచితనం నీకేం తెలుసే పిచ్చి మొహమా?" అని సూటిగా గర్వంగా ప్రశ్నించి ఉండేది.

* * *

వారం తరువాత.

లక్ష్మి రాకకోసం ఆత్రుతగా ఎదురు చూడసాగింది నీలిమ. మధ్యాహ్నం నుండి ఆమె మనసు మనసులో లేదు. భోజనాల సమయంలో సహోద్యోగుల మధ్య జరిగిన సంభాషణ చెవుల్లో గింగురుమంటోంది. సత్య అన్నట్లు లక్ష్మిలాంటి పిల్లల తల్లిదండ్రులు వారి సంపాదనని తాగుడులాంటి వ్యసనాలకి వాడుకొంటారా? వాళ్ళకి చదువు, సరైన తిండి బట్టలు లేకపోయినా వాళ్ళు అలా దుర్వినియోగం చేస్తారా? మరప్పుడు లక్ష్మి లాంటి వాళ్ళు ఏమవ్వాలి? వాళ్ళలో తెలివి తేటలు వచ్చే సరికి బంగారం లాంటి సమయం అంతా పోతుందే? వాళ్ళది గుర్తించారా? నీలిమ బుర్ర వేడెక్కింది. మరోకొలీగ్ అన్నట్లు వాళ్ళు తిండి, గుడ్డ, నిద్ర వుంటే చాలనుకొంటారా! వారంలో ఓ సినిమా చూసి పరమానందం చెందుతారా! అంతేనా! వాళ్ళకి ఇంతకన్నా వేరే అవసరాలు ఏమీ లేవా! అపురూప మైన విజ్ఞాన జ్యోతి వెల్గులు, ఆ వెలుగులో ప్రపంచాన్ని చూడాలనే ఆసక్తి వారికి వుండదా! విజ్ఞానం ద్వారా పొందే ఆనందాన్ని వారు కాంక్షించడం లేదా! ఆలోచన్లలోను వాచీకేసి చూసుకొంది. కనీసం లక్ష్మి తల్లిదండ్రులు అలా చేయకపోతే బావుణ్ణు అనుకొంది. జీవితపు మరో కోణాన్ని లక్ష్మికి చూపించాలని ఉబలాట పడుతోంది నీలిమ మనసు. నీలిమ ఆలోచన లోనే లక్ష్మి రావడం అంట్లు తోమడానికి ఉపక్రమించడం జరిగిపోయాయి. వెంటనే అడగడం బావుండదు అనుకొంది నీలిమ. లక్ష్మి అంట్లు తోమేంత వరకు నిశ్శబ్దం బరువుగా దొరలింది. ఒక్కొక్క పాత్రని కడిగి జాగ్రత్తగా పెడుతున్న లక్ష్మిని నెమ్మదిగా పిలిచింది.

"లక్ష్మీ!"

"ఏందమ్మా?"

ఏదో ఇది ఆమె గొంతు కడ్డు పడింది. అడగనా మాననా అన్న సంశయం. తల త్రిప్పి నీలిమకేసి చూసింది లక్ష్మి. లక్ష్మి వంక చూడనట్టే - మరో ప్రక్కకి తిరిగి అడిగింది నీలిమ. "నేను జీతం డబ్బులిచ్చి వారం రోజులయిపోయిందిగా లక్ష్మీ- మరి నువ్వు క్రొత్త బట్టలు కొనుక్కున్నావా?

"ఓ" అంటుంది అనుకొని లక్ష్మికేసి చూచింది నీలిమ. లక్ష్మి తల అడ్డంగా వూపడంతో నివ్వెరపోతూ అడిగింది "ఏం?"

"ఏమోనమ్మ కొనిస్తనన్నది గానీ..."

"ఏమయ్యింది లక్ష్మీ?"

"అయ్యాళ మా అయ్యకి, అమ్మకి బావుండ లేదు కదమ్మ అందుకని మందు తెచ్చుకొన్నారు.

"ఏం మందు?" అని అడగలేదు నీలిమ. ఆమె కళ్ళ ముందు లక్ష్మి రూపం దీన దృశ్యంలా కదలాడసాగింది. మనసు ఏదో గొణుక్కోసాగింది. చేదు మాత్ర మింగినట్లున్న నీలిమ మొహంలో అన్ని భావాలు లక్ష్మికర్థం కాలేదు. కానీ బట్టల తాలుకు ఆలోచనలు రివ్వు మంటూ ఎగిసాయి. ఆలోచనలతోనే ఇల్లు చేరింది. ఆలోచిస్తునే నిద్రపోయింది- కలలో కూడా క్రొత్త బట్టలా! మూడు నెలల బట్టి వాటి గురించి కన్న కలలు లక్ష్మి మనసులో సందడి చేయసాగాయి ఉదయం లేచి లేవగానే తల్లి దగ్గరికి వెళ్ళి అడిగింది లక్ష్మి. "అమ్మ నాకు బట్టలు కొంటానని కొనలేదేమే!"

కూతురి కేసి పరిశీలనగా చూసింది రాజవ్వ-

"కొంటాలేమే. ఇప్పుడు బట్టలకేమి తొందరొచ్చింది నిమ్మదంగా కొంటాలే!

ఎందుకోగానీ లక్ష్మి దుఃఖం వచ్చింది. "ఆఁ నువ్విట్లనే అంటవు గానీ నాకేం కొనవు నాకు తెల్సు."

నువ్వు కొననే కొనవు. ఏడుస్తూ అంది లక్ష్మి

"పొదుగాల లెయ్యంగనే ఇదేంది" విసుక్కుంది రాజవ్వ.

"ఆఁ నాకు బట్టలు కావాలి. లేకపోతే నాపైసలు నాకిచ్చేయి" అంది లక్ష్మి ఏడుస్తూ.

"ఏమన్నావ్? పైసలా? నీపైసలేడి నుండి వచ్చినాయె. రోజు ఇంట్లో తిండి తింటలేవు" రాజవ్వకి కోపం మితి మీరిపోయింది. "జానెడంత లేవు గానీ నాపైసలంటున్నావు' అంటూ ఒక్కటేసింది.

అనంతృప్తి, ఉక్రోషం దుఃఖం రూపంలో బయట పడ్డాయి.

"నన్నెందుకుకొడుతున్నావు?" అంది ఏడుస్తూనే.

"మళ్ళీ అడుగుతున్నావు" అంటూ రాజవ్వ మరొకటి వేయడంతో ఏడుస్తూ గుడిసె బయటికొచ్చింది లక్ష్మి

ఏం చెయ్యాలో తోచలేదు. దుఃఖం మాత్రం పెరుగుతోంది. ఏడుస్తూ పరుగుతీయసాగింది. దుఃఖంలో రొప్పుతూ గుమ్మంలోకి దూసుకొని వచ్చిన లక్ష్మిని ఆశ్చర్యంగా చూసింది నీలిమ. ఏమైంది అనే ప్రశ్న కూడా ఆమె నోట్లో నుండి వెలువడలేదు.

"నేను చదువుకొంటానమ్మా. నిజంగా చదువుకొంటానమ్మా" వెక్కిళ్ళ మధ్య చెప్పసాగింది లక్ష్మి. ఏం జరిగిందో అర్థంకాకపోయినా ఏం చెబుతుందో అర్థం అయ్యింది. నీలిమకి. ఆ చిన్నారి హృదయంలో చిన్న దెబ్బ తాకిన చోటే బలమైన కోర్కె పుట్టింది. దానికి తాను కాస్త వూపిరి పోస్తే చాలు సరిగ్గా ఎదుగుతుంది. "సరే! సరే లక్ష్మీ! నా దగ్గరే చదువుకుందువుగాని! ఈవ్వాల్టి నుండీ! అంది నన్నని చిరునవ్వు పెదవులపై కదలగా నీలిమ. □

రుమేనియాలో ఎయిడ్స్ కారణంగా చనిపోతున్న పిల్లలసంఖ్య రోజురోజుకి పెరుగుతోంది. తల్లిదండ్రులనుంచి ఈ వ్యాధి సంక్రమిస్తున్న పిల్లల నూటికి యిద్దరువుంటే మిగిలినవారికి రక్తపు మార్పిడి (Blood Transfusion) వలన ఎయిడ్స్ సోకుతోంది. బ్లడ్ బ్యాంక్‌లో రక్తం గురించి ఎవరూ పట్టించుకోకపోవడమే యిందుకు కారణం.